క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం

జూలూరుపాడు: పడమటనర్సాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సమ్మక్క–సారలమ్మ వన దేవతల జాతరకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను ఆలయ ప్రధాన పూజారి కబ్రం నరసింహారావు, జాతర నిర్వాహణ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఆదివారం ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను కొత్తగూడెంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈనెల 14 నుంచి జరగనున్న సమ్మక్క– సారలమ్మ దేవతల జాతర మహోత్సవం జరగనున్నట్లు వివరించారు. ఈ జాతర ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేను హాజరు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జాతర నిర్వాహణ కమిటీ సభ్యులు కిన్నెర లింగయ్య, కొడెం సైదులు, కబ్రం సంతోష్, కిన్నెర విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

రాణించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

టేకులపల్లి: టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు దివ్యశ్రీ, శ్రీహరిణి పవార్, గీత రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటారు. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, గైడ్ టీచర్ మోహన్‌రావు ఆదివారం వివరాలు వెల్లడించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 3న జిల్లాస్థాయిలో చెకుముకి పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన ఈ ముగ్గురు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



అన్నదానం ప్రారంభిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలు ముత్యాలమ్మ, మైసమ్మ, బొడ్రాయిలకు మూడురోజులుగా పూజలు నిర్వహించి వేదం డితులు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాణప్రతిష్ఠ చేసి ప్రతిష్ఠించారు. గ్రామంలోని ప్రతీఒక్కరిని ఆయురారోగ్యాలతో కాపాడాలని కోరుకున్నారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తన స్వగ్రామంలో జరిగే విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

టేకులపల్లి: కొప్పురాయి పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో నిర్మించనున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం శంకుస్థాపన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠాచార్యులు మారోజు శ్రీనివాసాచార్యులు, విక్రమాచార్యులు, చైతన్యా చార్యులు, రవితేజాచార్యుల ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పూనెం వీరస్వామి దొర, నరేష్ పటేల్, కుంజ రవి, కుంజ రమేష్, చీమల భద్రయ్య, పూనెం బొర్రయ్య, కల్తి స్వామి, కల్తి భాస్కర్, రేపల్లె వెంకటేశ్వర్లు, పోరండ్ల నవీన్, పూనెం నాగేశ్వర్‌రావు, ఇర్ప చిరంజీవి, ముడిగ కోటి పాల్గొన్నారు.

రేషన్‌షాపులో బియ్యం తనిఖీ



స్టాక్‌ను తనిఖీ చేస్తున్న డీటీ శ్రీనివాసులు

నవభారత్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కాలనీలోని రేషన్ షాపులో డిప్యూటీ తహసీల్దార్ సుంకరి శ్రీనివాసులు ఆదివారం తనిఖీ నిర్వహించారు. స్టాక్‌ను లెక్కించి రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సమయంలో రేషన్‌షాపుకు వచ్చిన స్థానికులు రేషన్ బియ్యాన్ని అమ్ముకుంటున్నారని డీటీకి తెలియజేశారు. ఇంకా పలు ఫిర్యాదులు చేశారు. గతంలో ఉన్న డీలర్‌పై ఆరోపణలు రావడంతో మరొకరికి అప్పగించారనే చర్చ జరిగింది. ఈ విషయమై డీటీని వివరణ కోరగా.. శ్రీనగర్‌కాలనీలోని రేషన్ షాపు నుంచి బయట బియ్యం అమ్ముతున్నట్లు ఫిర్యాదు రావడంతో తనిఖీలు చేసినట్లు డీటీ సుంకరి శ్రీనివాసులు తెలిపారు. ఎక్కువ బియ్యం పట్టుబడలేదని తెలిపారు.

పార్కింగ్ జోన్ కలేనా ?!

- కొత్తగూడెంలో కాగితాలకే పరిమితమైన ప్రణాళికలు
- ఆచరణపై దృష్టి సారించని అధికార యంత్రాంగం
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- తరచుగా 'ట్రాఫిక్' చలాన్లతో బెంబేలు



రైల్వే స్టేషన్ ఆవరణలో పార్కింగ్ చేసిన కార్లు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రంగానే కాక 'ఏ' గ్రేడ్ మున్సిపాలిటీ అయిన కొత్తగూడెంలో పార్కింగ్ జోన్ లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఏర్పడ్డాక అన్ని ప్రభుత్వ శాఖలు కొలువుదీరడంతో పాటు అదే స్థాయిలో జనాభా సైతం పెరిగింది. కానీ వారి అవసరాలకు తగిన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు, ట్రాఫిక్ అధికారుల సమన్వయంతో వాహనాలు పార్కింగ్ జోన్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా 90 వేలకు పైగా జనాబా ఉన్న కొత్తగూడెం పట్టణంలో ఆ దిశగా అడుగులు పడడం లేదు.

ఆరేళ్ల క్రితం ప్రణాళిక...

కొత్తగూడెంలో పార్కింగ్ జోన్ ఏర్పాటుకు ఆరేళ్ల క్రితం మున్సిపల్ అధికారులు ప్రణాళిక రూపొందించారు. రైల్వే స్టేషన్ ఆవరణ, బస్టాండ్ ప్రాంతాల్లో సర్వే కూడా నిర్వహించినా ఆ తర్వాత వదిలేశారు. జిల్లా కేంద్రంలో ఉదయం 8నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4రాత్రి 8 గంటల వరకు పోస్టాఫీసు సెంటర్ మొదలుకొని బస్టాండ్ ఏరియా, సూపర్‌బజార్ ఏరియా, గణేష్‌టెంపుల్ ఏరియా, చిన్నబజార్, పెద్దబజార్ ఏరియాల్లో తీవ్రంగా వాహనాల రద్దీ ఉంటుంది. వివిధ పనులపై వచ్చేవారు వాహనాలను ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. కార్లను రైల్వే స్టేషన్ ఆవరణలో పార్కింగ్ చేసి డబ్బు చెల్లిస్తారు. మిగతా వాహనాలను రోడ్డు వెంట నిలిపితే తరచుగా ట్రాఫిక్ పోలీసులు ఫైన్లు విధిస్తున్నారు. ఇదేంటని అడిగితే రాంగ్ ప్లేస్ అని నో పార్కింగ్ జోన్ అని చెబుతుండగా.. అసలు పార్కింగ్ జోన్ ఎక్కడ ఉందనే ప్రశ్నకు సమాధానం రావడం లేదు.

ఆదాయం వస్తుందని తెలిసినా...

మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అంశాలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో జరిపిన సర్వే ప్రకారం జిల్లా కేంద్రంలో పార్కింగ్ జోన్ ఏర్పాటు చేస్తే వాహనదారుల నుంచి నిర్ణీత రుసుము వసూలు చేయొచ్చు. తద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది. ఆ దిశగా చర్యలు లేకపోవడంతో పనులపై వచ్చే వారు వాహనాలు నిలిపితే జరిమానా పడుతోంది. దీంతో పాటు కొత్తగూడెం సూపర్‌బజార్ సెంటర్‌లోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎదుట మొదలు గణేష్‌టెంపుల్ వరకు కూడా మధ్యలో బారికేడ్లు ఏర్పాటు చేయడం వల్ల మరింత ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఒక రోడ్డు నుంచి మరో రోడ్డుకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. కనీసం పాదచారులు నడవడానికి కూడా వీలులేకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.



రహదారిని ఆనుకుని నిలిపిన వాహనాలు

ఇక వన్ వే రోడ్డు ఉన్న చిన్నబజార్, పెద్దబజార్ ఏరియాలో వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఉంటోంది. ఈమేరకు రైల్వే స్టేషన్ ఆవరణతో పాటు రైతుబజార్ సెంటర్, వారపు సంత ఆవరణ, పోస్టాఫీసు ఏరియా ప్రాంతాలను పార్కింగ్ జోన్లకు పరిశీలిస్తే అటు వాహనదారుల ఇక్కట్లు తీరడంతో పాటు మరోపక్క మున్సిపాలిటీ ఆదాయం సమకూరుతుంది.

పార్కింగ్ జోన్ ఏర్పాటు చేయాలి



కొత్తగూడెంలో పార్కింగ్ జోన్ ఏర్పాటు ఆవశ్యకత ఉంది. పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు లేక రోడ్డుపైనే వాహనాలు నిలపాల్సి వస్తోంది. దీంతో తరచుగా ట్రాఫిక్ పోలీసులు ఫైన్ విధిస్తున్నారు. ఈ ఫైన్లు కట్టలేక ఇబ్బంది పడుతున్నాం. ఇకనైనా పార్కింగ్ జోన్ ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలి.

– సురేందర్, వాహనదారుడు, కొత్తగూడెం

పోలీసులు సూచిస్తే సర్వే



పార్కింగ్ జోన్ ఏర్పాటు కోసం పోలీసు శాఖ నుంచి ఎటువంటి సూచనలు లేవు. పార్కింగ్ జోన్ ఏర్పాటు అవసరముందని పోలీసు శాఖ సూచిస్తే ఇరు శాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే చేపడుతాం. ఆతర్వాత అవసరమైన పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు మా శాఖ తరపున చర్యలు తీసుకుంటాం.

– రఘు, మున్సిపల్ కమిషనర్ కొత్తగూడెం

ఘంటసాల పాటలు కలకాలం ఉంటాయి

పాల్వంచ: ఘంటసాల పాడిన పాటలు తెలుగు ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయని పాల్వంచ కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు పాకాలపాటి రోశయ్య చౌదరి అన్నారు. ఆదివారం పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి సందర్భంగా స్థానిక పాకాలపాటి కృష్ణయ్య కళాభవనంలో ఘంటసాల అభ్యుదయ సమితి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రోశయ్య చౌదరి మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఘంటసాల పట్టుదలతో సంగీతం నేర్చుకుని సినీ రంగంలో తనదైన ముద్రవేసుకున్నారని కొనియాడారు. భగవద్గీత ఆలపించి భావితారాలకు సంగీత నిధిని అందించినట్లు తెలిపారు. అనంతరం పలువురు గాయకులు ఘంటసాల పాటలు ఆలపించారు. ఎస్‌కె.వీరా, ఎస్‌కె.బాషా, కాల్వ విజయ్, బి.రాంబాబు, మోహన్, లక్ష్మీనారాయణ, అరుణకుమారి, ఉపేందర్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కండి..



మాట్లాడుతున్న మధు

ఇల్లెందురూరల్: పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు నడిపింటి మధు పిలుపునిచ్చారు. మండలంలోని సుభాష్‌నగర్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలతోపాటు ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా జరిగే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతీఒక్కరూ శ్రమించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఎస్పీని బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో తడికల శివకుమార్, యాసం సిద్దార్థపూలే, బాదావత్ ప్రతాప్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, కాంపాటి నరేష్, జ్ఞానసుందరం, ఆనందరావు, రంజిత్, సుధాకర్, దీప్లా, రాహుల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోతకాలపు పండుగ

ఇల్లెందురూరల్: ప్రభువైన యేసుకు మనస్ఫూర్తిగా సమర్పించే ఫలమే కోతకాలపు పండుగ అని సుంకరగూడెం చర్చి ఫాస్టేట్ చైర్మన్ డేవిడ్ రాజు అన్నారు. మండలంలోని మామిడిగూడెం గ్రామ పంచాయతీ సుకరగూడెం గ్రామ చర్చిలో కోతకాలపు పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన దైవబోధనలను వినిపించారు. మంచిని ప్రేమించి మానవత్వాన్ని ప్రదర్శించడం భక్తికి నిదర్శనంగా పేర్కొన్నారు. యేసు ప్రభువుని నమ్ముకున్న వారు ఆస్తులు లేకున్నా భక్తిభావంతో ధనవంతులుగానే వర్ధిల్లుతారన్నారు. ఏడాదిపాటు సంపాదించిన సొమ్ములో దశమ భాగం నిత్యం ఆరాధించే ప్రభువైన యేసుకు సంతోషంగా సమర్పించుకుంటారని చెప్పారు. సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం షాలెంరాజు, పాస్టర్లు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డేవిడ్ రాజు

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



పాల్వంచ: వాసవీమాత పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



ఇల్లెందు: అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

పాల్వంచ: ఆర్యవైశ్యుల కులదైవం శ్రీ వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నటరాజ్ సెంటర్ నుంచి శాస్త్రీరోడ్ మీదుగా లలిత పరమేశ్వరి అమ్మవారి దేవాలయం వరకు అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు. అమ్మవారి పాటలు, కీర్తనలతో ఊరేగింపు సాగింది. అనంతరం ఆలయంలో వేద పండితులు చైతన్య శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు, అష్టోత్తరములు జరిపారు. ఈ సందర్భంగా చైతన్య శర్మ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కులదైవం వాసవీ అమ్మవారు ఆత్మగౌరవానికి ప్రతీకగా ఆదిపరాశక్తిగా అవతరించి హోమగుండం ఏర్పాటు చేసుకుని ఆత్మార్పణం చేసుకుని వాసవీ మాతగా మారిందన్నారు. అనంతరం ప్రమిదలతో 108 హోమ గుండాలను మహిళా భక్తులు చేసారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు చలవాది ప్రకాష్, పెండ్యాల రోజాలక్ష్మీ, నరసింహారావు, చితిరాల ఉమాశంకర్, దుర్గ, అరవపల్లి శ్రీలక్ష్మీ, మాలే రాజేశ్, బచ్చు శ్రీనివాస్, రామ్‌కుమార్, వెంకటేశ్వరరావు, గిరిధర్, పూర్ణ, నిర్మల, ఇందిర, నాగ, హరీష, స్రవంతి, సుజాత, మౌనిక, శ్రీలత, అన్నపూర్ణ, పార్వతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: వాసవీ క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందించుకుని ప్రజల ముంగిటకు వస్తామని పట్టణ వాసవీ క్లబ్ అధ్యక్షుడు సతీష్ తెలిపారు. ఆదివారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శ్రీ హరిహర క్షేత్రంలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఝెలుగూరి మధుబాబు, కోశాధికారి సైఫా రాజశేఖర్, వ్యామసాని జనార్దన్, అర్వపల్లి రాధాకృష్ణమూర్తి, కండె రమేష్, తాటిపల్లి సుబ్బారావు, సురేష్, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

కేఓసీలో అద్దె వాహనాలకు టెండర్ ఆహ్వానం

ఇల్లెందు/టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో ఒక నాన్ ఏసీ అంబులెన్స్, 2 నాన్ ఏసీ జీపు అద్దె వాహనాల నిర్వహణకు టెండర్ ఆహ్వానిస్తున్నట్లు ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 4వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. ఓసీ ప్రభావిత నివాసులు, భూ నిర్వాసితులు, మాజీ కార్మికుల నిరుద్యోగ పిల్లలు, ఓసీ ప్రభావిత ప్రాంత నిరుద్యోగులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ధ్రువీకరణ పత్రాల ఆధారాలతో ఇల్లెందు జీఎం కార్యాలయంలోని పర్చేజ్ విభాగంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అధ్యక్షుడిగా అఫ్రోజ్ పాషా



టేకులపల్లి: ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ ఇల్లెందు నియోజకవర్గం అధ్యక్షుడిగా టేకులపల్లి మండలానికి చెందిన మహమ్మద్ అఫ్రోజ్ పాషా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం టేకులపల్లి మండలం కేంద్రంలో ఆయన వివరాలు వెల్లడించారు. ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ జిల్లా స్థాయి సమావేశం చంద్రుగొండలో జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ షబ్బీర్ హుస్సేన్, ఉపాధ్యక్షులు ఎస్కే రబ్బాని ఆధ్వర్యంలో తనను ఇల్లెందు నియోజకవర్గం అధ్యక్షుడిగా ఎన్నుకుని నియామకపు పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

ముగ్గురి అరెస్ట్

ఇల్లెందురూరల్: చోరీలక పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను కొమరారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాలు... కొంతకాలంగా ఇల్లెందు, గుండాల మండలాల్లోని బీఎస్‌ఎన్‌ఎల్ టవర్‌లలో బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ ప్రారంభించారు. ఆదివారం కొమరారంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. ఇల్లెందు, గుండాలతోపాటు కరకగూడెం, దుమ్ముగూడెం మండలాల్లో కూడా చోరీకి పాల్పడినట్లు నిందితులు అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన ఖమ్మం హవేలి ఏరియాకు చెందిన నంద్యాల పవన్‌కుమార్, కొణిజర్లకు చెందిన పొన్నబోయిన మౌళికృష్ణ, ఖమ్మం ఎన్ఎస్‌పీ క్యాంపు ఏరియాకు చెందిన గన్నేరు అఖిల్‌స్వరూప్‌లను అరెస్టు చేసి వారి వద్ద 70 బ్యాటరీలను రికవరీ చేశారు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి

ఇల్లెందురూరల్: వృత్తి పరమైన నైపుణ్యం పెంపొందించుకుంటేనే గ్రామీణ వైద్యులు మనుగడ సాధిస్తారని గ్రామీణ వైద్యుల సహాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని రొంపేడు మామిడితోటలో గ్రామీణ వైద్యుల సహాయ సంఘం 21వ మండల మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యులు పరిమితికి మించి వైద్యం చేయొద్దని సూచించారు. పల్లె ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలని చెప్పారు.

సంఘం బలోపేతం కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. సమావేశంలో కాంతారావు, నటరాజ్, రాజశేఖర్, పురుషోత్తం, శ్రీనివాస్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి..



సరస్వతీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఇందిర

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని వెనకబడిన తరగతుల బాలుర, బాలికల వసతి గృహాలలోని పదో తరగతి విద్యార్థులు పదికి పదిపాయింట్లు సాధించి, జిల్లాను ముందుభాగంలో ఉంచాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇందిర అన్నారు. ఆదివారం పాత కొత్తగూడెం బూడిదిగడ్డ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత సర్వసతి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులు సబ్జెక్ట్ మీద పట్టు సాధించాలని, తద్వారా రాబోయే పబ్లిక్ పరీక్షల్లో పదికి పది పాయింట్లు వచ్చే విధంగా కష్టపడి చదువుకోవాలన్నారు. కలెక్టర్ పది తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. వార్షిక పరీక్షలంటే విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదని, జిల్లాలో బీసీ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కష్టపడి చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్యూలరాణి, విజయలక్ష్మి, అపర్ణ, హిమంత్, నర్సింహారావు, సరస్వతి, కౌసల్య, అరుణ, రవి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

డాడీస్ రోడ్డు యాప్‌తో బహుళ ప్రయోజనాలు



క్యూఆర్ స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: డాడీస్ రోడ్డు యాప్‌తో బహుళ ప్రయోజనాలున్నాయని, వాహనదారుల వాహనాలకు భద్రం ఉంటుందని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో డాడీస్ రోడ్డు యాప్ క్యూఆర్ కోడ్ స్టిక్కర్‌ను కొత్వాల శ్రీనివాసరావు, పట్టణ ఎస్ఐ బి.రాము, ట్రాఫిక్ ఎస్ఐ చంద్ర శేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భగా కొత్వాల మాట్లాడారు. ఎస్ఐ రాము మాట్లాడుతూ.. వాహనానికి, ప్రయాణికులకు ప్రమాదం జరిగినప్పుడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తమ కుటుంబ సభ్యులకు వెంటనే సమాచారం వెళుతుందన్నారు. వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, పార్కింగ్ సమస్యలు, బ్లడ్ బ్యాంక్ వివరాలు, లాక్, అన్‌లాక్ సమస్యలు, వెహికిల్ రిస్క్, వాహన దొంగతనాల సమస్యల పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు కొత్తపల్లి సోమయ్య, ఏడీఈ చర్ల ముత్తయ్య, చర్ల నాగేశ్వరరావు, బిల్లా నాగేంద్రబాబు, సిద్దెల హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ పాలకవర్గానికి సన్మానం..

పాల్వంచరూరల్: గంగాదేవిగుప్ప గ్రామంలో ఆదివారం ఇటీవల పదవీ విరమణ పొందిన దంతలబోరు గ్రామపంచాయతీ పాలకవర్గం మాజీ సర్పంచ్ అలివేలు, పాలకవర్గం సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు హాజరయ్యారు. మాట్లాడుతూ... ప్రజాప్రతినిధులు తమ పదవీ కాలంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ప్రజలు జీవితాంతం గుర్తుంచుకునే విధంగా సేవలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కె.వెంకన్న, ఎంపీటీసీ కె.నాగమణి, కార్యదర్శి ప్రవీణ్, మాజీ సర్పంచ్ రమేష్, తెల్లం మల్లేష్, శ్రీలతారెడ్డి, మెంటం రాము, నాగరాజు, సురేష్, ఎల్లంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆక్రమణపై చర్యలు తీసుకోండి

పాల్వంచరూరల్: నిత్యం రద్దీగా ఉండే పెద్దమ్మగుడి వద్ద ఫంక్షన్ హాల్స్ మధ్యలో ఉన్న గ్రామపంచాయతీ రహదారిని ఆక్రమించుకుని ఇతర ఫంక్షన్ హాళ్లకు వెళ్లే వాహనదారులకు, భక్తులకు ఇబ్బందికరంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దమ్మతల్లి గుడి ఎదుట గల ఫంక్షన్ హాళ్ల మధ్య ఉన్న పంచాయతీ రోడ్డును సాయిగణేష్ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు ఆక్రమించుకున్నారని దీనివల్ల పైకి వెళ్లే మూడు ఫంక్షన్ హాల్స్‌కు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. చర్యలు తీసుకోవాలని రామిరెడ్డి, కె.పుల్లయ్య పంచాయతీ ప్రత్యేకాధికారికి, డీఎస్పీ, ఎస్ఐలకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

సింగరేణి ఉద్యోగికి ప్రశంసలు

సింగరేణి(కొత్తగూడెం): హైదరాబాద్‌లో సాలార్జంగ్ మ్యూజియంలో ఆదివారం క్రియేటివ్ హార్ట్స్ అంజి ఆకొండి ఆధ్వర్యంలో జరిగిన మాస్టర్ స్ట్రోక్ 3 పెయింటింగ్‌లో సింగరేణి ఉద్యోగికి ఆంతోటి ప్రభాకర్ ప్రతిభ చూపారు. సింగరేణి ట్రాన్సిట్ గెస్ట్ హౌజ్‌లో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్ వేసిన క్రియేటివ్ చిత్రం ప్రముఖులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రభాకర్‌ను ప్రముఖ కార్టునిస్టులు దాకోజు శివప్రసాద్, శేషబ్రహ్మం, శంకర్, సుభాని, మ్యూజియం నిర్వాహకులు ప్రభాకర్‌ను సన్మానించి, ప్రసంసించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ తనకు ఈ పోటీలో అవకాశం రావటమే అరుదుగా భావించానన్నారు. కానీ వందల మంది పాల్గొన్న ఈ పోటీలో తన చిత్రం అతిథులను ఆకట్టుకోవటం, తనను ప్రముఖులు అభినందించటం హర్షణీయమని, ఇది సింగరేణి సింగరేణి సంస్థ విజయంగా భావిస్తున్నానన్నారు.



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న కార్టూనిస్టులు

కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా రవి



ఇల్లెందు: నియామకపత్రం అందుకుంటున్న రవి



జూలూరుపాడు: నియామకపత్రం అందుకుంటున్న కిషన్ నాయక్

ఇల్లెందు: పోలారం గ్రామానికి చెందిన అజ్మీర రవిని కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.రవి నియామకపత్రం అందజేశారు. ఆదివారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ గెలుపుకు రవి మండలంలో విశేషంగా కృషి చేశాడన్నారు. అజ్మీర రవి నాయకత్వంలో త్వరలో మండల కమిటీని విస్తరించనున్నట్లు తెలిపారు.

సేవాదళ్ మండల అధ్యక్షుడిగా కిషన్ నాయక్..

జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా భోజ్యాతండా గ్రామ పంచాయతీ వెనక తండాకు చెందిన వాంకుడోత్ కిషన్ నాయక్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆదివారం స్థానిక విలేకరులకు కిషన్ నాయక్ తెలిపారు. శనివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ చేతులు మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

13న కేసీఆర్ సభను జయప్రదం చేయండి

టేకులపల్లి: ఈనెల 13న నల్గొండ, మర్రిగూడెం బైపాస్‌లో జరగనున్న కేసీఆర్ పోరుగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ టేకులపల్లి మండల అధ్యక్షుడు బొమ్మెర వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బోడ బాలునాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం టేకులపల్లిలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను గండికొట్టే విధంగా కృష్ణా నది మీద ఉన్న నీటి ప్రాజెక్టులను నిర్వహణ బాధ్యతను కేంద్రానికి ధారాదత్తం చేస్తూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఈ గర్జనకు తెలంగాణవాదులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు వేలాదిగా తరలిరావాలని కోరారు.